ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 17 నవంబరు 2025

ఆయువు తీస్తున్న హైవేలు

రహదారులు నాగరికతకు చిహ్నాలు అంటారు... నిజమే... కానీ నేడు జిల్లాలోని జాతీయ రహదారులు మృత్యుమార్గాలుగా మారాయి. ఒకప్పుడు విశాలమైన రోడ్లను చూసి సంబరపడిపోయిన ప్రజలు... ఇప్పుడు ఆ రోడ్లవైపు చూడాలంటేనే భయపడుతున్నారు. ఏ క్షణం ఏమి జరుగుతుందో...! ఎప్పుడు, ఎక్కడ ఎవరి ఆయువు మూడుతుందోనని వణికిపోతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



- చిన్నపాటి నిర్లక్ష్యానికి ఏటా వందలాది మంది బలి
- జాతీయ రహదారి నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- గమ్యం చేరకనే తిరిగిరాని లోకానికి ప్రయాణికులు
- అతి వేగమే ప్రమాదాలకు కారణం

జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వీటి సంఖ్య ఎక్కువైంది. గత వారం నెల్లూరు ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలబడి ఉన్న వారిపై టిప్పర్ దూసుకెళ్లి, ముగ్గురిని పొట్టన పెట్టుకుంది.నలుగురిని క్షతగ్రాతులను చేసి ఆసుపత్రిలో పడుకోబెట్టింది. అంతకుముందు ముందు సంగం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. ఇటీవల కొడవలూరు మండలం రాజుపాళెం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒక సంఘటన మరచిపోక ముందే.. మరో హృదయ విదారక సంఘటన కళ్ల ముందు నిలుస్తోంది. విశాలమైన జాతీయ రహదారులపై ఇలా ఎందుకు జరుతున్నదనేదానికి జవాబు చెప్పాల్సింది నేషనల్ హైవే అథారిటీ అధికారులు, టోల్‌గేటును నిర్వహిస్తున్న కంపెనీలే.

● అధికారుల వైఫల్యం

ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా నిలువరించాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులు, స్థానిక పోలీసులపై ఉంది. హైవే పెట్రోలింగ్ వాహనాల్లోని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తే ఈ పరిస్థితి ఉండదు. ఇటీవల అసలు రహదారిపై హైవే పెట్రోలింగ్ వాహనాల జాడే కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా కట్టడి చేయగలిగితే హైవేపై ప్రమాదాలను 90 శాతం వరకు నియంత్రించవచ్చుననే వాదన బలంగా ఉంది.

● వేగ నియంత్రణపై చర్యలేవి..?

ప్రైవేటీకరణలో భాగంగా రోడ్లు విశాలంగా తయారయ్యాయి. అధికారులు కూడా ఇక వేగం మీ ఇష్టం...అని వదిలేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగం. రోడ్లు విశాలంగా ఉండడంతో వేగం అపరిమితం అయింది. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించామని, సూచిక బోర్డులు పెడుతున్నామని అధికారులు అంటున్నా, ఆ బోర్డులు ఎక్కడా కనిపించవు. హైవే ఎక్కిన ఏ వాహనం కూడా 120 కిలోమీటర్లకు తక్కువ లేకుండా ప్రయాణిస్తున్నాయి. వాస్తవానికి అంత వేగానికి మన రోడ్లు అనువైనవి కావు. 80 కిలోమీటర్ల కన్నా వేగం మించితే వాహనం మన కంట్రోల్‌లో ఉండదు. కానీ ప్రజలకు ఈ విషయంపై అవగాహన లేదు. అవగాహన కల్పించే ప్రయత్నం అధికారులు చేయడం లేదు.



విశ్రాంతి భవనం లేక సంగం పరిధిలోని ముంబాయి రహదారి పక్కన నిలిపిన లారీలు

● ఆగి ఉన్న వాటిని ఢీకొనడం వల్లే...

ఇటీవల జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధికం ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడం వల్లే చోటుచేసుకుంటున్నాయి. నెల్లూరు - చెన్నై, ఆత్మకూరు-బద్వేలు, రాపూరు- ఆత్మకూరు రోడ్లపై జరిగే ప్రమాదాల్లో 90 శాతం ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడం వల్లే జరిగినవి. హైవేపై డ్రైవర్ల విశ్రాంతి కోసం విశ్రాంతి స్థలాలు(రెస్ట్ ఏరియాస్) ఏర్పాటు చేశారు. అక్కడ ఒక్క వాహనం కూడా నిలపడం లేదు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడమే ఇందుకు కారణం. ఉదాహరణకు సీతారామపురం మండలం డీజేపేట వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రెస్ట్ ఏరియాలో రైతులు ధాన్యం ఎండబెట్టుకొంటున్నారు. దుత్తలూరు వద్ద రెస్ట్ ఏరియాను జాతీయ రహదారి నిర్వాహకులు డంప్ యార్డ్‌గా ఉపయోగించుకుంటున్నారు. రెస్ట్ ఏరియాల్లో వాహనాలు నిలపకుండా రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేయడంతో ఓవర్ టైక్ చేసే సమయంలో వాహన వేగాన్ని నిలువరించలేక, నిలిపి ఉన్న వాహనాలకు ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నారు.



ఆత్మకూరు : ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న వాహనదారుల విశ్రాంతి భవనం

నిరుపయోగంగా రెస్ట్ రూమ్‌లు

ఆత్మకూరు : హైవే వెంబడి వాహనదారులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన విశ్రాంతి భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో, మండలంలోని బోయళ్లచిరువెళ్ల సమీపంలో ముంబాయి- నెల్లూరు జాతీయ రహదారి పక్కన నిర్మించిన వాహనదారుల విశ్రాంతి భవనాలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శం. వాటిని నిర్మించింది మొదలు ఇప్పటి వరకు వాహనదారులు విశ్రాంతి తీసుకోలేదు. మందుబాబులకు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా ఉన్నాయి. విశ్రాంతి భవనాల్లో మందు సీసాలు, దుమ్ముధూళితో అశుభ్రంగా ఉన్నాయి. ఇక మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు.



ఆత్మకూరు : రెస్ట్ రూమ్‌లో అపరిశుభ్రంగా ఉన్న వరండా

ఆగి ఉన్న వాహనాలతోనే ప్రమాదాలు



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు నుంచి బుచ్చి టోల్‌గేట్ వరకు హైవేపై రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమౌతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హైవేపై రెస్ట్ ఏరియాల్లో టాయిలెట్లు వున్నా అక్కడ సరైన వసతి సౌకర్యాలు లేవు.

బుచ్చి : టోల్‌గేట్ సమీపంలో హైవేపై అడ్డదిడ్డంగా నిలిపి ఉన్న వాహనాలు

వసతులు లేక... విశ్రాంతి తీసుకోలేక..!

దుత్తలూరు(ఉదయగిరి) : రెస్ట్ ఏరియాలో వసతులు లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను నిలపడంలేదు. దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని 565 జాతీయ రహదారి పక్కన రెస్ట్ ఏరియా ఏర్పాటు చేశారు. ఇందులో ఎలాంటి వసతులు లేకపోవడంతో వాహనదారులు గ్రామ శివారు ప్రాంతంలో తమ వాహనాలను నిలుపుకుని సేదతీరుతున్నారు. రెస్ట్ ఏరియా రహదారి నిర్వాహణ చేపట్టే వారి వాహనాలు, సామగ్రితో డంపింగ్ యార్డును తలపిస్తోంది.



దుత్తలూరు సెంటర్ సమీపంలోని రెస్ట్ ఏరియాలో రహదారి నిర్వహణ సామగ్రి, వాహనాలు

కిక్కిరిసిన బస్సులు

కాలేజీలకు ఆలస్యం..



ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సు

- విద్యార్థులకు సమస్యగా ఉచిత బస్సు పథకం
- ఫుల్లుగా ఉన్న ప్రయాణికులతో ఆపకుండా వెళ్తున్న వైనం
- సకాలంలో విద్యాసంస్థలకు వెళ్లలేకున్న స్టూడెంట్స్
- పరిష్కారం ఎవరి చేతిలో..?

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళల కోసం రాష్ట్రంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం విద్యార్థులకు సమస్యగా మారింది. పేద విద్యార్థులు దూరప్రాంతాల్లోని విద్యాసంస్థలు, కళాశాలలకు తమ గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో వెళ్తూ ఉంటారు. ఉచిత ప్రయాణంతో ఎక్కువమంది మహిళలు బస్సు ప్రయాణం చేస్తుండటంతో విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు.

● ఆపకుండా వెళ్తున్న బస్సులు

విద్యార్థులకు ఆర్టీసీ ఉచితంగానూ, రాయితీ ద్వారానూ పాసులను మంజూరు చేసింది. ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్న క్రమంలో ఏ బస్సు చూసినా మహిళలతో కిక్కిరిసి ఉంటున్నాయి. కాలపట్టికను అనుసరిస్తూ విద్యార్థులు బస్సుల కోసం వచ్చిన సందర్భంలో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో మరో బస్సు వచ్చేంతవరకు వేచి ఉండి విద్యాసంస్థలకు చేరుకోవాల్సి ఉంది. దీంతో ఆలస్యంగా స్కూళ్లకు చేరుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

● స్టూడెంట్ స్పెషల్ ఎటు వెళ్తుందో...?

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కొన్ని బస్సులను ఏర్పాటు చేశారు. అయితే అవి ఏ సమయానికి ఎటు వెళ్తున్నాయో తెలియక విద్యార్థులు సాధారణ బస్సులను ఎక్కాల్సి వస్తోంది. స్టూడెంట్ స్పెషల్ అంటూ బోర్డులను ఏర్పాటు చేసుకొని, వచ్చే బస్సులు అన్ని ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేదు. దీంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పరిష్కారం ఎవరి చేతిలో...

పరిష్కారం ప్రభుత్వం చేతిలోనా... అధికారుల చేతుల్లోనా .. ? అనేది అంతుచిక్కడం లేదు. ఇదిలాఉండగా మహిళలతో కిక్కిరిసి ప్రయాణిస్తున్న బస్సుల్లో మగవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారితోపాటె విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఈ సమస్యను అధిగమించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందా.... లేక ప్రభుత్వమే చొరవ చూపుతుందా...? అని తెలియాల్సి ఉంది.



ఈ విద్యార్థి పేరు జడ సాయిరాహుల్. బీటెక్ చదువుతున్నాడు. అల్లూరు నుంచి కోవూరు మండలం గంగవరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు నిత్యం వెళ్లాల్సి ఉంది. బస్సు పాస్ తీసుకుని సాధారణ బస్సుల్లో వెళ్లే పరిస్థితి. ఇటీవల బస్సులు వేళకు రాకపోవడంతోపాటు కిక్కిరిసి వస్తుండటంతో బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో తరచూ కళాశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో కళాశాల యాజమాన్యం విధించే శిక్షకు బలికావాల్సి వస్తుంది.



ఫొటోలో కనిపించే విద్యార్థి పేరు సీహెచ్.ధనుష్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నెల్లూరు డైకస్ రోడ్డులో ఉంటున్నాడు. కోవూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. నెల్లూరు నుంచి వెళ్లే ప్రతీ బస్సు కిక్కిరిసి వెళ్తుండడంతో ఇతర బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ కారణంగా బస్సులు సమయపాలన పాటించకపోవడంతోపాటు రద్దీ అధికంగా ఉండడంతో కళాశాలకు వెళ్లాలన్నా, తిరిగి ఇంటికి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

ఆటోను ఢీకొన్న లారీ

12 మందికి గాయాలు



మర్రిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు మండలం నందవరం కూడలి వద్ద నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఆటోను లారీ ఢీకొనగా, 12 మందికి గాయాలయ్యాయి. అందులో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసుల కథనం మేరకు వివరాలు.. జామాయిల్ కర్రనరికే కూలీలు 12మంది స్వగ్రామం ఆత్మకూరు మండలం బంటపల్లి నుంచి ఆటోలో దుత్తలూరుకు వెళ్తున్నారు. ఆటో నందవరం కూడలి వద్ద ఉదయగిరి రోడ్డు వైపు మలుపు తిరిగే క్రమంలో నెల్లూరు నుంచి బద్వేలు వైపు వెళ్తున్న బూడిద లోడు లారీ ఢీ కొనటంతో ఆటో బోల్తా కొట్టింది.ఈ ప్రమాదంలో కొందరు రోడ్డుపై పడిపోయారు. మరికొందరు ఆటోలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్ఐ శ్రీనివాసురావు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. తీవ్రగాయాలతో ఆటోలో చిక్కుకున్న వారిని వెలికితీసి, 108వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మరికొందరిని నెల్లూరుకి తరలించారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎనిమిది మంది స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కుష్టు సర్వే

- 3,789 బృందాలు ఇళ్లిళ్లూ తిరిగి ఆరా
- నెలాఖరు వరకు నిర్వహణ
- కొత్త కేసులు గుర్తిస్తే వైద్యచికిత్సలు

నెల్లూరు (వైద్యం) నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం (నేటి) నుంచి కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర కుటుంబ ఆరోగ్య, సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెలాఖరు వరకు ఈ సర్వే నిర్వహిస్తారు. ఇంటింటికి తిరిగి ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా..? ఉంటే వారు ఎలాంటి చికిత్సలు పొందుతున్నారు.. అసలు చికిత్సలు చేయించుకుంటున్నారా..? అనే వివరాలతో సర్వే జరుగుతుంది. ఒంటిపై రెండింటికి మించి మచ్చలు ఉన్నట్లయితే, దాన్ని కుష్టువ్యాధిగా అనుమానిస్తారు. అనంతరం పూర్తిస్థాయి పరీక్షలు స్థానిక పీహెచ్‌సీల్లో చేసేలా చర్యలు తీసుకుంటారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన వలంటీర్లు క్షేత్రస్థాయిలో కుష్టు రోగులను గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్స చేసేలా చేయూతనిస్తారు.



● అధికారుల నియామకం

సర్వే వివరాలను ఎప్పటికప్పుడు సేకరించేందుకు అధికారులను నియమించారు. 14 రోజుల పాటు ఈ సర్వే జరుగుతుంది. జిల్లాలో కుష్టు వ్యాధి వ్యాధి నివారించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో ప్రస్తుతం కుష్టువ్యాధిగ్రస్థుల సంఖ్య కూడా 0.44 శాతానికి చేరుకోవటంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుష్టువ్యాధి అంటువ్యాధి కాదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

● కొత్తగా 57 మందికి చికిత్స

కొత్తగా కుష్టువ్యాధిగ్రస్థులు 57 మందిని గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. మొత్తం 490 మంది కుష్టువ్యాధిగ్రస్థుల్లో దివ్యాంగులు కూడా ఉన్నట్లు అధికారులు నిర్ధారించి పింఛను అందిస్తున్నారు. అలాగే వారికి వాకర్లు, ఊతకర్రలు అందిస్తున్నారు. కుష్టువ్యాధిగ్రస్థుల్లో శస్త్రచికిత్సలు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. గత ఏడాదిగా 30 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహకం కింద రూ. 8వేలు అందిస్తున్నది.

● సర్వేకు 3789 బృందాలు

జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వేలో 3789 బృందాలు పాల్గొంటున్నాయి. ఒక్కో బృందంలో ఏఎన్ఎంతోపాటు ఆశా కార్యకర్త ఉంటారు. ఈ సర్వేలో కొత్త కేసులను గుర్తించటమే కాకుండా కుష్టువ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కలిగిస్తారు.

వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందిస్తాం

నేటి నుంచి నిర్వహించే కుష్టువ్యాధి సర్వేలో కొత్తగా ఎవరైనా వ్యాధిగ్రస్థులు ఉన్నారా.. అని పరిశీలిస్తాం. గుర్తించిన వారికి వైద్య చికిత్సలు అందిస్తాం. అన్నీ పీహెచ్‌సీల్లో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. వ్యాధి పూర్తిగా తగ్గే వరకు మందులను ఉచితంగా పంపిణీ చేస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైనవారిని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు చేస్తాం. సర్వేకు ప్రజలంతా సహకరించాలి.

- డాక్టర్ ఖాదర్‌వలి,
కుష్టువ్యాధి నివారణ జిల్లా అధికారి

యూరియా కొరత

వెంటాడుతోంది

ఖరీఫ్ పోయి రబీ సీజన్ వచ్చినా రైతులను ఎరువుల కొరత వెంటాడుతూనే ఉంది. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో నీటివనరులన్నీ జలకళను సంతరించుకోగా ఉత్సాహంగా పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే, మార్కెట్లో ఎరువులు దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బస్తా యూరియా రూ.270కి విక్రయించాల్సిన వ్యాపారులు రూ.420కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. డీఏపీ సైతం రూ.100 వరకు ఎమ్మార్పీకి మించి చెల్లించేందుకు సిద్ధపడితేనే వ్యాపారులు సరుకు ఇస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. వలేటివారిపాలెం, గుడ్లూరు, పోకూరు, లింగసముద్రం, పెదపవని వంటి గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరో రూ.20, రూ. 30 అదనంగానే వసూలు చేస్తున్నారు. 'ఎంఆర్‌పీతో పనిలేదు. మీరు ఎంత చెబితే అంత ఇస్తాం. మాకు ఎరువులు ఇవ్వండి' అంటున్న రైతులకు మాత్రమే ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులు.. ఎవరైనా ధర గురించి ప్రశ్నిస్తే ఎరువులు స్టాకు లేదని చెప్పేస్తున్నారు. దీంతో అదునులో విధిలేక రైతులు కొనుక్కోవాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. కందుకూరు డివిజన్‌లోనే కాదు.. జిల్లావ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి.

- బ్లాక్ మార్కెట్‌లో బస్తాకు రూ.150కి పైగా బాదుడు
- ముక్కుపిండి వసూలు చేస్తున్న వ్యాపారులు
- ప్రశ్నిస్తే 'నో స్టాక్' అంటున్న వైనం
- నిద్రపోతున్న అధికారయంత్రాంగం
- అన్నదాతల ఆందోళన



కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ప్రాంతంలో రాళ్లపాడు రిజర్వాయరు మినహా మోపాడు, మాచవరం, కరేడు, రాజుపాలెం, చాకిచర్ల, పోకూరు ప్రధాన చెరువులతోపాటు 100కి పైగా ఉన్న చిన్నాపెద్దా చెరువులన్నీ సంవృద్ధిగా నిండాయి. దీంతో చాలా ఏళ్ల తర్వాత రైతులు మాగాణి సాగుకు సిద్ధపడుతున్నారు. అలాగే తేలికనేలల్లో ముమ్మరంగా పొగనాట్లు జరుగుతుండగా, నల్లనేలల్లో పొగనాట్లకు వేలాది ఎకరాలలో ఎరువులు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇక ఈ ప్రాంతం లో వేలాది ఎకరాలలో విస్తరించి ఉన్న జామాయిల్, పండ్లతోటలకు ఈ వర్షాలతో ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమై ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు.

● విచ్చలవిడిగా బ్లాక్‌మార్కెటింగ్

కందుకూరుతోపాటు లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెంలలోని ఎరువుల వ్యాపారులు విచ్చలవిడిగా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతూ రైతులను దోచుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు నెలలక్రితం కందుకూరులో జరిగిన సమావేశం సందర్భంగా ఎరువుల సమస్యను జిల్లా వ్యవసాయాధికారిణి దృష్టికి విలేకరులు తీసుకెళ్లటంతోపాటు సమస్యకు అసలు కారణాలను కూడా వివరించారు. ఇకపై అన్ని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేస్తామని వీఏఏలు ఇండెంట్లు ఇచ్చేలా ఏఓలు, ఏడీఏ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎరువులకు ఎలాంటి కొరత లేదని, అవసరం మేరకు ఇండెంట్లు ఇస్తే అన్నిరకాల ఎరువులను సరఫరా చేస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత ఆర్ఎస్‌కేలకు ఎరువులు తెప్పించుకోవటంలో వ్యవసాయాధికారులు శ్రద్ధ చూపకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఏదో మొక్కుబడిగా ఒకటి రెండు సార్లు యూరియా తెప్పించి మమ అనిపించారు. దీంతో వ్యాపారులు ఇష్టారీతిగా రైతులను నిలువునా దోచుకుంటున్నారు. వ్యాపారులకు తోడ్పాటు అందించేందుకే ఆర్ఎస్‌కేలలో అవసరం మేరకు ఎరువులు తెప్పించటం లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100) : 625

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,809
వెండి కిలో ధర రూ. 1,64,500
వెండి ఒక గ్రాము రూ.164.70

పునర్నిర్మాణ దాతలకు సావనీర్ పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ముద్రించిన సావనీర్‌ను ఆలయ పునః నిర్మాణానికి సహకరించిన దాతలకు పంపిణీ చేయాలని పాలక మండలి నిర్ణయించుకున్నట్లు ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పునఃనిరాణానికి సహకరించిన దాతలు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని సావనీర్ అందుకోవాలని పేర్కొన్నారు. అలాగే సోమవారం సాయంత్రం జరిగే 1008 మృతికా (పుట్టమచ్చ) శివలింగాలకు జరిగే లక్ష బిల్వార్చన, విష్ణుమూర్తికి తులసీపూజ, సహస్ర లింగాల పూజల్లో పాల్గొనాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రంలో పరిశ్రమల వరద : అబ్దుల్‌అజీజ్

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్ర జ్యోతి) : ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమల వరద కొనసాగుతోందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమ్మిట్‌తో రాష్ట్రానికి అపూర్వస్పందన లభించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పరిశ్రమల పెట్టుబడికి తొలి గమ్యస్థానం కానుందని పేర్కొన్నారు. సీఐఐ సమ్మిట్‌లో వచ్చిన పెట్టుడబుల ప్రతిపాదనలు ఈ విషయాన్ని మరోసారి నిరూపించాయని తెలిపారు. ఈ సమ్మిట్‌లో మొత్తం రూ.1.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ప్రతిపాదనలు నమోదయ్యాయని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి 113 ప్రముఖ సంస్థలు పాల్గొని ఆసక్తి కనబరిచాయని తెలిపారు. 27 అంతర్జాతీయ కంపెనీలు ప్రత్యేక దృష్టి సారించాయని తెలిపారు. మేడిన్ ఆంధ్ర బ్రాండ్‌పై పెట్టుబడుల ఆసక్తి గత ఏడాదితో పోలిస్తే 37 శాతం అధికంగా ఉందని పేర్కొన్నారు. నెల్లూరుతోపాటు దక్షిణ ఆంధ్రలో రాబోయే ప్రాజెక్టుల వల్ల 18 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని, ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

నేత్రదానం


హరేంద్ర (ఫైల్)

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): నగరంలోని గోమతి నగర్‌కు చెందిన సన్నపరెడ్డి హరేంద్ర(60) ఆదివారం మృతి చెందారు. మృతుడి నేత్రాలను సుభాష్ సేవాసంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి సహకారంతో మృతుడు కుటుంబ సభ్యురాలు వర్షిణీ అంగీకారంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అందచేశారు. టెక్నీషియన్ సురేష్ ఈ నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 9959589321ను సంప్రదించాలని కోరారు.

క్రీమి స్పాట్‌లో అగ్ని ప్రమాదం

నెల్లూరు(క్రైం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని నర్తకీ ప్లాజాలో ఉన్న క్రీమి స్పాట్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. సాయంత్రం విశేష పుష్పాలంకారం, పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివనామ స్మరణలతో కార్తీక దీపాలు వెలిగించారు.

● **భక్తిశ్రద్ధలతో సహస్ర శంఖాభిషేకం**

నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామికి ఆదివారం ఉదయం 1008 శంఖాల జలంతో అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పాలాభిషేకాలు, కలశం ఊరేగింపులు జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం విశేష పూలంగిసేవ, శివనామ భజనలు, కార్తీక వనభోజనాలు జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.


1008 శంఖాలతో అభిషేకం అలంకారం

గ్రామాల అభివృద్ధికి కృషి : రూరల్ ఎమ్మెల్యే


త్రీఫేస్ విద్యుత్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రూరల్ నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ములుముడిలో చంద్రన్న విద్యుత్ వెలుగుల్లో భాగంగా త్రీఫేజ్ విద్యుత్‌ను ఆయన ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలు అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తుల్లో తాను మొదటి వాడినన్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పల్లె ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నెల్లూరు - తాటిపర్తి రహదారి ములుముడి వద్ద కలుజుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు.

● **రూ. 24 లక్షలతో నిర్మించిన పార్కు ప్రారంభం**

నగరంలోని 28వ డివిజన్‌లో రూ.24 లక్షలతో నిర్మించిన పార్కును టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ విజయకుమార్, సర్పంచు కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పులి రాంగోపాల్, అశోక్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నీరాజనాలు

నెల్లూరు(సాంస్కృతికం) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమంలో విరివిగా పాల్గొని గ్రంథాలయ రంగానికి ఇతోధికంగా కృషి చేసిన మహనీయులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర రంగంలో కృషి చేసిన మహనీయుడు ఎస్ఆర్.రంగనాథన్ వంటి మహనీయులకు నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సభను నిర్వహించారు. ముఖ్య వక్తగా రిటైర్డ్ తహసీల్దారు, ప్రముఖ రచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ తహసీల్దారు శ్రీనివాసులు, విశ్రాంత గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. అనంతరం పుస్తకాలు బహూకరించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, గ్రంథాలయ ఉద్యమం ప్రాముఖ్యత అలాగే వారోత్సవాల ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు ఎస్.సునీత పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉత్తమ విద్య

● రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ


పూర్ణాహుతిలో మంత్రి నారాయణ దంపతులు

నెల్లూరు(విద్య), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వీఆర్ హైస్కూల్‌ను దాతల సహకారంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించి ప్రారంభించామన్నారు. అదే తరహాలో ప్రస్తుతం మూలాపేట బాలికోన్నత పాఠశాలను డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సుధాకర్‌రెడ్డి దత్తత తీసుకుని 40వేల చదరపు అడుగల విస్తీర్ణంలో అద్భుత నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, జిగ్నా, టీవీఎస్ కంపెనీలు, రెడ్డి ల్యాబ్స్, ఏఎంఆర్ కంపెనీలు పాఠశాలలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారని, అందరి సహకారంతో 15 పాఠశాలలను సిద్ధం చేసి 15వేల మంది పేద పిల్లలకు కార్పొరేట్ విద్యనందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే నగరంలోని సండే మార్కెట్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

● **కాపు భవన్‌కు మరో రూ.కోటి**

నెల్లూరు(హరనాథపురం): అసంపూర్తిగా ఉన్న కాపు భవనం అభివృద్ధికి తన పిల్లలు రూ.కోటి ఇస్తారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ ప్రకటించారు. ఆదివారం నగరంలోని కాపు భవన్‌లో జరిగిన కార్తీక వనభోజన కార్యక్రమంలో సతీమణి రమాదేవితో కలిసి మంత్రి పాల్గొన్నారు. శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ భవన నిర్మాణానికి అప్పట్లోనే తన కుటుంబం తరఫున రూ.కోటి విరాళంగా ఇచ్చానన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మరో రూ.కోటి ఇప్పించి కాపు భవనాన్ని పూర్తి చేయిస్తానని చెప్పారు. గత ప్రభుత్వం కాపు, బీసీ భవనాలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం కాపు భవన్‌ను చూస్తే బాధేస్తుందని, మరమ్మతులకు రూ.60 లక్షలు అవుతుందన్నారు. కాపు భవన్ అభివృద్ధి కమిటీని వేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బలిజ, కాపు కులస్తులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నవరసాలు ఒలికించిన యువ కళాకారులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పురమందిరంలో యువ సంగీత కళాకారులు ఆరంగ్రేటం నవరసాలు పండించింది. స్వరకల్పనలో, సంగీత వాయిద్యాలు పలికించడంలో వారు చూపిన ప్రతిభకు శ్రోతలు, ప్రేక్షకులను మైమరిపించింది. సంగీత మాస్టర్, స్వరాంజలి మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ అధినేత దారా సురేష్ శిష్య బృందం తొలి సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నెరజాన, గణపతి పాటలు, లవకుశ, పాత, కొత్త సినిమా పాటలలకు తమస్వరాలను, వాయిద్యాలను పలికించారు. గాత్రం, వాయిద్యాలపై శిక్షణ పొందిన 30 మంది చిన్నారులు తమ తొలి ప్రదర్శనలో అందరి మన్ననలు అందుకున్నారు. ముఖ్య అతిథులుగా అమరావతి కృష్ణారెడ్డి, పొట్లూరి శ్రీనివాసులు, ఏపీఎస్ కృష్ణమోహన్‌రావు, రాచపాలెం రఘు, సుస్వరరాజ, నిజాముద్దీన్, వ్యాఖ్యాత శర్మ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘ కార్యవర్గ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటీ కార్యవర్గ సమావేశం వేలూరు రంగారావు అధ్యక్షతన నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆ సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆర్. ప్రభాకర్‌రావు, పోకూరు ప్రభాకర్‌రావు, పుల్లయ్య, వెంకటేశ్వరరావు, సాయిబాబా, వల్లూరు బాలకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజల ప్రారంభం


పడిపూజకు సిద్ధమైన 18 మెట్లు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం కేరళ సంప్రదాయ మండల పూజలు ధ్వజారోహణం కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజలు నిర్వహించి మంగళవాయిద్యాలు, పంచవాయిద్యాలు, స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషల మధ్య నిర్వహించారు. అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమాలను అయ్యప్ప దేవస్థానం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు బొగ్గుల మురళీ మోహన్‌రెడ్డి, పావల ప్రసాద్, పలువురు అయ్యప్ప స్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చింతారెడ్డిపాళెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలి



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు, తదితర నాయకులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చింతా రెడ్డిపాళెం మార్గంలో జాతీయ రహదారికి అండర్‌పాస్ బ్రిడ్జి వెంటనే నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం అండర్‌పాస్ బ్రిడ్జి కోసం మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. జాతీయ రహదారి నుంచి చిల్డ్రన్స్‌పార్క్ వరకు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదన్నారు. అయితే ఇటీవల ఈ బ్రిడ్జి నిర్మాణంపై మంత్రి నారాయణ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని చెప్పినా నిర్మాణం ప్రాంభించేంత వరకు మా పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మదాల వెంకటేశ్వర్లు, కత్తిశ్రీనివాసులు, నాగేశ్వరరావు, కొండాప్రసాద్, సతీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాబోయే చలికాలంలో చలితో బాధపడకూడదని వృద్ధులు, పేదలకు ఆదివారం మూలాపేటలోని బ్రాహ్మణ వీధిలోని గురునిలయంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది చంద్ర, హైదరాబాద్ వ్యాపారవేత్త పెంచలయ్య స్వామి, వెంకయ్యస్వామి, శిష్యులు నారాయణదాసు స్వామి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అందరికీ అన్నసంతర్పణం చేశారు. ఈ కార్యక్రమాలను గురునిలయం ఇన్‌చార్జ్ మాకాని గోపి పర్యవేక్షించారు.

ఏడాదిలో ముగ్గురు సెక్రటరీలపై వేటు!


పొదలకూరు పంచాయతీ కార్యాలయం

పొదలకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలో సెక్రటరీలు తరచూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుని సస్పెన్షన్‌కు గురవుతున్నారు. ఏడాది వ్యవధిలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల పనితీరు సరిగా లేక ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రూ.50 వేలకు పైగా జనాభా ఉన్న పొదలకూరు మేజర్ పంచాయతీలో లింగంపల్లి, చిట్టేపల్లి మజారా గ్రామాలు అంతర్భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం రూ. కోటికిపైగా ఆదాయం సమకూరుతోంది. ఈ పంచాయతీలో పనిచేసిన ముగ్గురు కార్యదర్శులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల సెస్పెండ్ అయిన యశ్వంత్ సింగ్ మాత్రం నిధులు, ఇతర పాలనాపరమైన ఇబ్బందులతో కాకుండా ఇంటి పనుల అసెస్మెంట్ నెంబర్లకు ఫోన్ నెంబర్ల అనుసంధానం వ్యవహారంలో సస్పెండ్ అయ్యారు. అంతకుముందు ఇక్కడ నాలుగేళ్ల పనిచేసి పదోన్నతిపై దక్కిలి ఈఓపీఆర్‌డీగా వెళ్లిన ఎస్కె అల్లాబకష్ పాత లే అవుట్‌లో ఇళ్ల ప్లాట్లకు వ్యక్తిగతంగా అనుమతులు ఇచ్చారనే కారణంతో సస్పెండ్ అయ్యారు. శ్రీనివాసులు అనే సెక్రటరీ సత్యనారాయణను లే అవుట్‌లో ప్రజాప్రయోజనాల స్థలానికి సంబంధించి న్యాయపరమైన వ్యవహారంలో ఆధారాలను సక్రమంగా సమర్పించలేదని ఉన్నతస్థాయి అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో వరుసగా సెక్రటరీల సస్పెన్షన్ వ్యవహారం సచివాలయ వ్యవస్థలో పెద్ద చర్చగా మారింది. సాధారణ పరిపాలనతోపాటు మంచినీటి సరఫరా, చెత్త తొలగింపు, వీధిదీపాలు వేయించడం తదితర వ్యవహారాల్లో సెక్రటరీలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఎంపీడీవో ఇతర పంచాయతీలకు చెందిన కార్యదర్శులను ఇన్‌చార్జ్‌లుగా వేసేందుకు ప్రయత్నిస్తున్నా వారు బెంబేలెత్తిపోతున్నారు. కారణం ఏదైనా పొదలకూరుకు వస్తే సస్పెండ్ అవుతున్నారనే ప్రచారం జరుగుతుండడంతో కార్యదర్శులు ఇక్కడ బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో మేజర్ పంచాయతీ కొంతకాలంగా ఇన్‌చార్జ్‌లతోనే కాలం వెళ్లదీస్తోంది. పొదలకూరు మేజర్ పంచాయతీకి రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని మండలప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు ఇమేజ్‌తో పెట్టుబడుల వెల్లువ


మాట్లాడుతున్న వేంకటేశ్వర్లు రెడ్డి

కోవూరు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఇమేజ్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశిస్తే, రూ 13.26 లక్షల కోట్లు విలువ చేసే 613 ఒప్పందాలు వచ్చాయన్నారు. 16.31 లక్షల మందికి ఉపాధి కలుగుతుందన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఇందుకూరుపేట, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భగవద్గీత, త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురమౌళి, సభ్యులు అన్నపూర్ణ, కొండమ్మ, రాజేంద్ర ప్రసాద్, కీర్తిశ్రీ, కల్పన, శేఖర్, ధనలక్ష్మీ, సునీత, సుజిత్, ప్రదీప్, రమ, అవినాష్, కృష్ణ, వెంకటేశ్వర్లు, సునీల్, నరసింహప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ

● విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అమలు : డీఆర్‌డీఏ పీడీ


గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్రపు డెక్క ఆకుతో ఎరువు తయారీ కేంద్రాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా సంగం మండలం లోని తరుణవాయిలో ప్రారంభించినట్లు డీఆర్ డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. ఆదివారం ఆమె తరుణవాయిలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సందర్శించి తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 రోజులకు ఎరువు తయారవుతుందని, దానిని అగ్రికల్చర్ ల్యాబ్‌కు పంపి పరీక్షల అనంతరం బాగుందని తేలితే జిల్లా వ్యాప్తంగా మరికొన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంగం మండలంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, రైతు రమణారెడ్డి తదితరుల ప్రోత్సాహంతో తరుణ వాయిలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం మధుసూధన్, ఏపీఎం రవి శంకర్ రెడ్డి, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందరర్భంగా అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారికి కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మెట్ల పూజ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జొన్నవాడలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప మెట్లు పూజ వైభవంగా జరిగింది. స్థానిక అయ్యప్ప దీక్షాపరులు పిళ్ళెళ్ల శరత్ చంద్ర, వినయ్ తేజ నివాసంలో నిర్వహించిన మెట్లు పూజలో అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు.

నేడు జొన్నవాడ ఆలయంలో మహారుద్ర హోమం

మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో కార్తీకమాసం 4వ సోమవారం సందర్భంగా మహారుద్ర హోమం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్తీక వన భోజనాలు


వనభోజనాలలో పాల్గొన్న ఆర్యవైశ్యులు, భక్తులు

బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్‌లో ఆదివారం ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం వైభవంగా జరిగింది. రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన పరమశివుడు, శివలింగానికి అన్నాభిషేకం చేశారు. కార్తీక దీపాన్ని వెలిగించి గంగమ్మకు పూజలు చేశారు. తెలనాకుల సుబ్బారావు, తటపర్తి శ్రీనివాసులు, మెంటా ఆనంద్, దరిశి బాల నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో తల్లిదండ్రుల సమావేశం


మాట్లాడుతున్న సుధారాణి

పొదలకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహం, బీసీ కళాశాల వసతి గృహాల్లో ఆదివారం వార్డెన్ సుధారాణి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం జరిగింది. నెల్లూరు డివిజన్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, చదువు, ఆరోగ్యం గురించి చర్చించారు. విద్యార్థులకు తల్లిదండ్రులే తొలి గురువులని, చదువు, సంస్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఆశా వర్కర్ లక్ష్మీ, నరసమ్మ, ట్యూటర్లు పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేయలేదని పోలీసులకు ఫిర్యాదు

తోటపల్లిగూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తన ఇంట్లో బాడుగకు ఉన్నవారు ఇల్లు ఖాళీ చేయడం లేదని మండలంలోని వరిగొండ గ్రామానికి చెందిన దువ్వూరు శ్రీనివాసులురెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను కొనుగోలు చేసిన ఇంటిని తన మరదలకు బాడుగకు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటిని ఖాళీ చేయమని కోరినప్పటికీ వారు నిరాకరించడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. స్థానికుల సహకారంతో ఇంటిని తిరిగి స్వాధీనం చేసుకున్న అనంతరం, కొంతమంది స్థానిక యువకులు ఇంటి తాళం పగులగొట్టి ఇంటిని ఆక్రమించుకున్నారని తెలిపారు.

డ్రోన్‌తో బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

●రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: డీఎస్పీ


జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్

మనుబోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మనుబోలు జాతీయరహదారి పరిధిలో ఆదివారం డ్రోన్ కెమెరాతో పోలీసులు బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివ రాకేష్‌లు బ్లాక్‌స్పాట్‌లను డ్రోన్‌తో చిత్రీకరించి ఆయా ప్రదేశాలలో ఉన్న వ్యాపారస్తులు, దుకాణ యజమానులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోర్టు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్‌రోడ్డు వరకు 7 బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయన్నారు. ఈ బ్లాక్ స్పాట్‌లకు అనుబంధంగా గ్రామాల దారులు జాతీయరహదారుల్లో కలుస్తున్నాయన్నారు. జాతీయ రహదారి పైకి వచ్చే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

దేవాలయంలో రాజకీయాలు వద్దు!

విడవలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాజకీయాలు చేయటం తగదని ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ తెలిపారు. రామతీర్థంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడారు. పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయానికి వివిధ ప్రాంతాలనుంచి మహిళా భక్తులు వస్తుంటారని, ఆ సమయంలో వెంకటనారాయణపురం అన్యమతానికి చెందిన ఓ వ్యక్తి ఆలయంలోనికి వచ్చి అర్ధనగ్నంగా స్నానం చేస్తుండగా, ఆలయ వాచ్ మెన్ అడ్డుకున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో వాచ్‌మెన్‌పై ఆ వ్యక్తి దాడి చేసే క్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు అడ్డుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయితే వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు వాస్తవాలను కప్పిపెట్టి ఆలయానికి చెడ్డపేరు వచ్చేలా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేయటం బాధకరమన్నారు. సమావేశంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాడి చంద్రశేఖర్, ఆలయ పాలక మండలి సభ్యులు రాఘాల వెంకటరమణయ్య, రాము, హిందూ సంఘాల నాయకులు ఏపూరు హరిప్రసాద్, వెంకటకుమార్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్ల పొదల తొలగింపు

విడవలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరిణి పంచాయతీలోని శ్మశాన వాటిక చెట్లు, పొదలతో నిండిపోవటంతో కర్మకాండలు చేయటానికి, మృతదేహాన్ని పూడ్చడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ టీడీపీ నాయకుడు బద్దిపూడి రాజా సొంత నిధులతో జేసీబీతో ఆదివారం పొదలను తొలగించి, శ్మశానానికి దారి ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకుడు కుడుముల మల్లికార్జున, గ్రామస్థులు రాజాను అభినందించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గణేశం దయాకర్ రెడ్డి, గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాల సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరించారు. అనంతరం గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు సుధారాణి, గణేశం దయాకర్‌రెడ్డి, గంపల మంజుల, కృష్ణచైతన్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. విద్యార్థులకు గణేశం సుమంత్‌రెడ్డి తినుబండారాలు పంపిణీ చేశారు.

సివిల్స్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ స్టడీ సర్కిల్ విజయవాడలో జరిగే సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో కోరారు. ఏదైనా డిగ్రీ చదివి, రూ.లక్ష లోపు వార్షికాదాయం కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులు ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, వసతి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తులను నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 9381554779ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.

19 నుంచి సైక్లింగ్ రాష్ట్ర జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని సంబరాపూర్‌లో డిసెంబరు 2 నుంచి 6వ తేదీ వరకు జరిగే జాతీయ సైక్లింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలబాలికల జట్ల ఎంపికలను ఈనెల 19, 20వ తేదీల్లో గుంటూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఎం.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ ఎంపికల్లో జిల్లాలో ఆసక్తి కలిగిన సైక్లింగ్ క్రీడాకారులు వారి సొంత సైక్లింగ్ పరికరాలతో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, మందాడ విలేజ్‌లోని గ్లోబల్ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లాలోని డీఎస్ఏ కార్యాలయంలో లేదా గుంటూరు డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరిగే 10వ సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఆదివారం జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన ఎంపికలలో ప్రతిభ చూపిన బాలబాలికల్లో గ్రూప్-1 విభాగంలో పీ.మణికంఠ, ఎస్.గణేష్, బీ.హిమనీష్, కే.ధన్యశ్రీ, గ్రూప్-2లో ఫర్హాన్, స్మతేష్, ఎస్.ఇవాంజిలిన్, గ్రూప్-3లో కే.లక్ష్మీనారాయణ, మెహ్మద్, ఎస్.పెర్సిస్, ఎల్.తులసి ఎంపికయ్యారు. ఈ ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, సనత్‌కుమార్, కోచ్ నాగరాజు పర్యవేక్షించారు.



రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



జీజీహెచ్‌లో ప్రిమెచ్యూర్ పిల్లల చికిత్స విభాగం

20 శాతం మంది

నేడు వరల్డ్ ప్రిమెచ్యూరిటీ డే

నెల తక్కువ పిల్లలే..!

- వారిలో ఐదుశాతం మందికి తీవ్ర అనారోగ్యం
- ఏటా చనిపోతున్న వారు 200 మంది పైగానే..
- గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలలు పూర్తికాకుండానే పుట్టే పిల్లలు ఎక్కువగా ఉన్నారు. వీరికి సరైన వైద్యం అందించక పోవటంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. వీరిలో ఎక్కువగా ఎస్టీ, ఎస్సీ పిల్లలే ఉంటున్నారు. దీనికి ప్రధానకారణం రక్తహీనత , పౌష్టికాహారం లేక పోవటమేనని వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నవంబరు 17న(నేడు) ప్రపం ప్రిమెచ్యూరిటీ డేను నిర్వహించాలని తీర్మానించింది. బరువు తక్కువగా ఉట్టే పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని పిలుపు నిచ్చింది.

● నెలలు నిండకనే పుట్టుక

జిల్లాలో ఏటా పుడుతున్న 40 వేలమంది బిడ్డల్లో 20 శాతం మంది నెలల తక్కువ (ప్రిమెచ్యూరిటీ)పిల్లలేనని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా 37 నుంచి 40 వారాల్లో పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉండారు. అయితే ముందే పుట్టే పిల్లల్లో చాలామందికి పూర్తి అవయవాలు లేకుండా పుడుతున్నారు. ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీవ్యవస్థ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగనిస్థితిలో ఉంటాయి. ఇలాంటివారికి వెంటిలేటర్ సహాయంతో కృత్రిమ శ్వాసను అందిస్తూ ఐవీ సాయంతో పోషకాలు అందించాలి. అలాగే నాడీవ్యవస్థ మెరుగుపడేందుకు ఇంక్యుబేటర్ సహాయంతో కృత్రిమ వైద్యాన్ని అందించాలి. 24 వారాల్లో పుట్టిన పిల్లలు 28 వారాల్లో పుట్టే పిల్లల కంటే బలహీనంగా ఉంటారు. ఈ పరిస్థితిలో పిల్లలను పుట్టిన గంటలోపే నియోనేటల్ కేర్ సదుపాయలు ఉన్న ఆసుపత్రులకు తరలించాలి. ప్రభుత్వ పరంగా జీజీహెచ్‌లో 40 పడకలతో ఎస్ఎన్‌సీయు(స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్) ఉంది. ఇక్కడ లెవల్ వన్ చికిత్సలు మాత్రమే అందుతున్నాయి. ప్రతిరోజూ ఇక్కడ 40 మందికి పైగా నెలలు తక్కువ పిల్లలు వైద్య చికిత్స పొందుతుంటారు. ఇక్కడ నియోనేటల్ కేర్ యూనిట్ వస్తే నిరుపేదలైన పిల్లలకు మరింత వైద్య చికిత్సలు అందించి ప్రాణాలు నిలిపే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య చికిత్సలు

జీజీహెచ్‌లో బరువు తక్కువ పిల్లలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నాం. జీజీహెచ్‌లో ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్) ద్వారా బరువు తక్కువ పిల్లలకు ఈ చికిత్సలు అందిస్తున్నాం. అత్యవసర వైద్యం అవసరమైన పిల్లలను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తున్నాం. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి మహిళ క్రమం తప్పకుండా వైద్యున్ని సంప్రదిస్తే నెలలు, బరువు తక్కువ పిల్లల జననాలు తగ్గించవచ్చు.



\- డాక్టర్ రామ్‌కిశోర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, జీజీహెచ్

● ఎన్నో రకాలుగా వైద్య చికిత్సలు

జిల్లావ్యాప్తంగా ఎన్నో ఆసుపత్రులు బరువు తక్కువ పుట్టిన పిల్లలకు లెవల్ 3 వైద్య చికిత్సలు అందిస్తున్నారు. దాదాపు 30 ఆసుపత్రులకుపైగా నియోనేటల్ కేర్ యూనిట్ సేవలు అందిస్తున్నాయి. అయితే క్రిటికల్ కేసులలో మాత్రం ఇలాంటి పిల్లలను బతికించలేక చేతులెత్తేస్తున్నాయి. ప్రతిఏటా జిల్లాలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, 10 సామాజిక ఆసుపత్రులు, 52 ప్రాథమిక ఆసుపత్రులలోనే 10 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఆయా ఆసుపత్రులకు వచ్చే వారంతా నిరుపేదలే. ఇలాంటి స్థితిలో అత్యుత్తమ వైద్యం అవసరమైతే ఈ ప్రిమెచ్యూర్ పిల్లలను ప్రభుత్వపరంగా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లికి అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, ఉమ్మనీరు ప్రసవానికి ముందుగానే కోల్పోవటం వంటి కారణాల వల్ల బరువుతక్కువ పిల్లలు పుడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతిఏటా జిల్లాలో బరువు తక్కువతో పుట్టే బిడ్డలలో 200 మందికి పైగా మృత్యువాత పడుతున్నారు.

పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అందుబాటులో లేక

గుండెపోటుతో ఒకరి మృతి

సీతారామపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిహెచ్‌సిలో వైద్యసిబ్బంది అందుబాటులో లేక గుండెపోటుతో ఒకరు మృతిచెందిన సంఘటన సీతారామపురంలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... స్థానిక బెస్తకాలనీకి చెందిన మరుబోయిన వెంకటరమణ అనే వ్యక్తి ఆదివారం గుండెపోటు రావడంతో స్థానిక పిహెచ్‌సికి తరలించారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన వైద్యాధికారులు, స్టాఫ్‌నర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో వెంకటరమణకు ప్రాథమిక చికిత్స చేసే దిక్కే లేకుండా పోయింది. సమయానికి కనీసం 108 వాహనం కూడా అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనంలో ఉదయగిరి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పీహెచ్‌సిలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి సకాలంలో ప్రాథమిక చికిత్సను అందించి ఉంటే వెంకటరమణ బతికుండేవాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా, గుండెపోటుతో వచ్చిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందించాల్సిన వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం వంటి సంఘటనలు పలుమార్లు జరగడంతో గ్రామస్థులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.



గుండెపోటుతో మృతిచెందిన మరుబోయిన వెంకటరమణ

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యా యత్నానికి పాల్పడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండిన వివాహిత మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు.. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం గోలగండికి చెందిన సాగురు జోగమ్మ, చంద్రయ్య(లేట్)లు దంతులు. వారికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. జోగమ్మ పెద్ద కుమార్తె ధనలక్ష్మి(31)కు వివాహం జరిగి భర్తతో విభేదాల కారణంగా గ్రామ పెద్దల సమక్షంలో విడిపోయారు. అనంతరం ఆమె తడ వద్ద శ్రీసిటిలో పనిచేస్తూ ప్రేమ్‌కుమార్‌ను ప్రేమించి ఏవాలయంలో వివాహం చేసుకుంది. ప్రేమ్‌కుమార్‌కు నగరంలోని ఓ హోటల్‌లో పని దొరకడంతో వారు నెల్లూరుకు కారపురం వచ్చి హోటల్ వెనుక వైపు ఓ అపార్ట్‌మెంట్ పై పోర్షన్‌లో బాడుగకు ఇల్లు తీసుకొని ఉంటున్నారు. ఈ క్రమంలో ధనలక్ష్మి తల్లికి ఫోన్ చేసి పరిస్థితులు బాగలేవని, డబ్బులు పంపాలని కోరగా ఆమె తన పరిస్థితి అలానే ఉందని చెప్పింది. దీంతో ఈ నెల 10వ తేది ధనలక్ష్మి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తలకు పెట్టుకునే సూపర్ వాస్మల్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ధనలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధా రించారు. దీంతో తల్లి జోగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం వేదా యపాలెం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బైకును ఢీకొన్న కారు

● త్రుటిలో తప్పిన ప్రమాదం


కావలి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంక్ రోడ్డులోని శాంతినగర్ సమీపంలో ఆదివారం బైకును కారు ఢీకొంది. అయితే తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుండి నెల్లూరు వైపు వెళుతున్న కారు వాహనచోదకుడిని ఢీకొంది. బుడంగుంట గేటు మీదుగా బైకుపై మాలను ధరించిన ఓ వ్యక్తి డివైడర్ మధ్యలో నుండి ఒక్కసారిగా రోడ్డు క్రాస్ చేయడంతో అతడిని కారు ఢీకొంది. కారు డ్రైవర్ ఉన్నట్లుండి బ్రేకు వేయడంతో బైకుతో సహా కిందపడిన అతడిని స్థానికులు పక్కకు తొలంగించారు. కారు డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది.



రోడ్డుపై పడ్డ బైకును తీస్తున్న స్థానికులు

చోరీ కేసు విచారణ

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని బీసీ కాలనీలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 39 సవర్ల బంగారు ఆభరణాలను దొంగిలించిన కేసుపై ఆదివారం కావలి డీఎస్పీ శ్రీధర్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నివాసాన్ని పరిశీలించారు. దుండగులు ధ్వంసం చేసిన ప్రధాన, స్టోర్ రూమ్ ద్వారాలు, కిటికీ గ్రిల్‌ను పరిశీలించి ఇంటి యజమాని యనమల తిరుపతితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉదయం నుంచి పట్టణంలోని పలు ప్రాంతాలు, బీసీ కాలనీలో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించడంతోపాటు నివాసాలు, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈయన వెంట సీఐ ఎస్.వెంకటరావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీను, ఆదిలక్ష్మి, రఘునాథ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



చోరీ జరిగిన నివాసాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీధర్

అర్ధరాత్రి.. వాహనం బ్రేక్‌డౌన్!

- రోడ్డుపై భయంభయంగా గడిపిన మహిళలు
- స్పందించిన టోల్ ప్లాజా మేనేజర్
- వాహనానికి మరమ్మతులు.. క్షేమంగా గమ్యానికి!

కావలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి 11 నుండి 12 గంటల మధ్య బ్రేక్ డౌన్ తో ఓ తుఫాన్ వాహహనం నిలిచిపోయింది. అందులో డ్రైవర్ మినహా అందరూ మహిళలే ఉండడంతో వారు వాహనం దిగి రోడ్డుపై భయభయంగా గడిపారు. దీంతో టోల్ ప్లాజా మేనేజర్ గణేష్ వెంటనే స్పందించి టోల్ గేట్‌లో ఆశ్రయం కల్పించటంతో మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల క్రితం పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన 15 మంది మహిళలు వాహనాన్ని అద్దెకు తీసుకుని ఆలయాల సందర్శనకు నెల్లూరు జిల్లాకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వాహనం మరమ్మతులకు గురైంది. విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా మేనేజర్ మహిళలకు ధైర్యం చెప్పి, బ్రేక్ డౌన్ అయిన వాహనం చుట్టూ హైవే మొబైల్ టీంతో సేఫ్టీ కోన్స్ పెట్టించారు. అంతేకాదు.. మెకానిక్‌ను పిలిపించి వాహనానికి మరమ్మతులు చేయించి క్షేమంగా మహిళలను స్వస్థలానికి పంపించారు. సకాలంలో స్పందించి అర్ధరాత్రి తమకు రక్షణ కల్పించిన టోల్ ప్లాజా మేనేజర్, సిబ్బందికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

నక్కలగండి.. నీరు దండి!

- అయినా సాగుకు నోచని ఆయకట్టు
- మరమ్మతులకు నోచని కాలువలు
- పట్టించుకోని అధికారులు
- అన్నదాతల ఆవేదన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులకు వరప్రసాదిని అయిన నక్కలగండి రిజర్వాయర్‌లో నిండా నీరునా, ఆయకట్టుకు నీరందడం లేదు. ఇందుకు కారణం కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవడమే. పూడికతీత మాటను అధికారులు ఎప్పుడో మరిచిపోయారు. దీంతో సాగునీరంతా వృథాగా పోతున్నదని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

● మొదట్లో 1200 ఎకరాల ఆయకట్టు

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని 1954లో నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో వరికుంటపాడు మండలం వెంగమాంబపురం, వేంపాడు, అశోక్‌నగర్, భోగ్యంవారిపల్లి, రామాపురం, కాకొల్లువారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి గ్రామాల్లోని 1000 ఎకరాలతోపాటు సమీపాన ఉన్న ప్రకాశం జిల్లా పామూరు మండలం కోడిగుడ్లపాడు, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లోని మరో 200 ఎకరాలకు సాగు నీరు అందేలా రూపకల్పన చేశారు. అనంతరం ఆ ప్రాంతంలోని మరికొంతభూమి సాగులోకి రావడంతో బీడు భూములు పంటలతో కళకళలాడాయి. 1989లో సంభవించిన తుఫాన్‌తో కట్ట తెగిపోవడంతో సుమారు ఏడేళ్ల పాటు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రైతులు తమ భూములను బీడు పెట్టుకున్నారు. 996లో రూ. 2 కోట్లతో పనులు చేపట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆపై తూములు, కాలువలు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పలుమార్లు రిజర్వాయర్ నిండినా, ఫలితం లేకుండా పోయింది.

● రాజకీయ ఒత్తిడితోనే..

ఈ పరిస్థితుల నేపథ్యంలో 2018లో కట్టను రివిట్‌మెంట్ చేయడంతోపాటు కాలువల ఆధునీకీకరణకు ప్రపంచ బ్యాంకు రూ. 2.96 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత మేరకు పనులు చేపట్టడంతో రూ. 1.90 కోట్లు జమ చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టడంతో రిజర్వాయర్ అభివృద్ధికి శాపంగా మారింది. కొంతమంది నాయకుల ఒత్తిడి తట్టుకోలేని ఆ కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివే శాడు. 2020 జూన్ నాటికీ పనులు పూర్తి చేయాల్సి ఉన్నా, చేయకపోవడంతో ఆ నిధులు రద్దయ్యాయి.

● వృథాగా నీరు..

దీనికితోడు అధికారుల నిర్లక్ష్య వైఖరితో లీకుల ద్వారా సాగునీరు వృథాగా పోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తూము మరమ్మతులు కూడా చేయక పోవడం దారుణం. రిజర్వాయర్‌లో చేపల పెంపకం సాగించే వ్యాపారుల కోసమే ఈ తంతు సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల సంగతి ఏమోగానీ అలుగు పారితే చేపలు కొట్టుకుపోతాయనే భావనతోనే తూమును అలాగే వదిలేశారనే విమర్శలు విన్పిస్తున్నాయి. రిజర్వాయర్ పరిధిలోని ఆరు కాలువల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. దీంతో నీటి విడుదల చేసినప్పటికీ దారి పొడవునా వృథాగా పోతున్నది. వర్షాల కంటే ముందు అటువైపు చూడని అధికారులు, ప్రస్తుతం నీరు ఉండడంతో మరమ్మతులు చేయడం ఇబ్బందిగా మారిందని సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మెట్ట ప్రాంత రైతులను దృష్టిలో ఉంచుకొని నక్కల గండి రిజర్వాయర్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



మరమ్మతులకు నోచుకోని కాలువలు



జలకళతో నక్కలగండి రిజర్వాయర్

కలుపు.. కన్నీరు

- కర్షకులకు కలుపు బెడద
- పంటల ఎదుగుదల, దిగుబడులపై ప్రభావం
- పెరుగుతున్న పెట్టుబడులు

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు వేసిన ఎరువులతో కలుపు ఏపుగా పెరిగి మొక్క ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతూ రైతులను కోలుకోలేని దెబ్బతీస్తోంది. ప్రధానంగా వరి, పసుపు, మొక్కజొన్న, జొన్న, శనగ, మినుము పంటలతోపాటు ఉద్యాన పంటలైన బత్తాయి, నిమ్మ, మామిడి పంటల్లో కలుపు సమస్య అధికంగా ఉంది. కలుపును నివారించేందుకు రైతులు వ్యయప్రయాసాలు పడుతుండడంతోపాటు ఆర్థికం గా నష్టపోతున్నారు.

ఎదుగుదల, దిగుబడులపై ప్రభావం

పంటల్లో కలుపు అధికంగా ఉండడంతో పంట ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉద్యాన పంటలైన బత్తాయి, నిమ్మ, మామిడి తదితర పంటల్లో వర్షాలు కురిసి అదునైన తరువాత సేద్యం చేసి కలుపు నివారిస్తారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో సేద్యం చేసినా తోటల్లో కలుపు విపరీతంగా పెరిగిపోవడంతో చెట్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. దీంతో చేసేదేమీ లేక రైతులు కలుపు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో పొలాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. వరి పంటలో వరిని పోలి ఉండే కలుపు ఏపుగా పెరుగుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు

పంటల సాగులో కలుపు నివారణకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో తెగుళ్ల, పురుగుల నివారణకు మాత్రమే మందులు వాడేవారమని, ప్రస్తుతం కలుపు నివారణకు మందులు సైతం వాడుతున్నారు. ఉద్యాన పంటల సాగు రైతులు వర్షాలు కురిసి భూమి అదునైన సమయంలో దున్ని కలుపు నివారిస్తా రు. లేదంటే గడ్డి మందు పిచి కారి చేస్తారు. కొంతమంది రైతులు భారం భరించలేక తోటలను అలాగే వదిలేస్తున్నా రు. వరి, శనగ, ఇతరత్రా పంట ల్లో కూలీల చేత రైతులు కలుపు తొలగింపు చర్యలు చేపడతారు. దీంతో పంటల సాగులో కలుపు నివారణకు అదనపు భారంతో అవస్థలు తప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బత్తాయి తోటలో ఏపుగా పెరిగిన కలుపు

సోమశిలకు 7,205 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 7,205 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 150, పవర్ టన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 73.363 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో 58.14టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 58.14 టీఎంసీలని ఏఈ అనీల్‌కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 550 క్యూసెక్కులు వస్తుండగా, 850 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.11,520
వెండి కిలో ధర	రూ. 1,51,600
వెండి ఒక గ్రాము	రూ.157.60

మూడు పుస్తకాల ఆవిష్కరణ

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ నగర్‌లోని బుద్ధ విహార్‌లో బొర్రా గోవర్ధన్ రచించిన ధర్మతేజ, ధర్మవీణ, బుద్ధ ధర్మసారం పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా గాడ్ల హరిప్రసాద్ బోధి పాల్గొని బుద్ధ విహార్ బాధ్యులతో కలిసి పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ బుద్ధ ధర్మసారం తెలుసుకుని, ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జ్యోతి, పూజల జయప్రకాష్, డాక్టర్ శివప్రసాద్, పూజల మమత, జ్యోతి, వంశీ బోధి, జీవన్ బోధి పాల్గొన్నారు.

విశాఖ సమ్మిట్ విజయవంతంపై ఎమ్మెల్యే ఇంటూరి హర్షం

కందుకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రెండురోజులపాటు జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీఎత్తున పెట్టుబడులు రాబోతున్నాయని, ఇకనుంచి రాష్ట్రం దశ, దిశ మారబోతున్నదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. విశాఖ సమ్మిట్‌లో 613 ఒప్పందాల ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తద్వారా 16 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని పేర్కొన్నారు. గతంలో జీనోమ్‌వ్యాలీ, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ ఐటీసంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి అభివృద్ధి సృష్టించిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన పరిశ్రమలు తీసుకొచ్చి మరోసారి చరిత్ర సృష్టించబోతున్నారన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

కొండాపురం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మండల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని సచివాలయం, రైతు సేవాకేంద్రం, హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సచివాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

'విశ్వోదయ'లో వైద్యశిబిరం

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ లక్ష్మీకృష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డయాబెటిక్, కంటి ఆరోగ్యంపై వైద్యులు అవగాహన కల్పించి, వైద్యశిబిరం నిర్వహించారు. 145 మందికి సమస్య ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ విజయ్ శంకర్ రెడ్డి, డాక్టర్ ఉమాచంద్, మోడరన్ ఐ హాస్పిటల్ వైద్యులు హెచ్ భారతి, జి విష్ణుతేజ, చిన్మయి, రేవనా రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

ఉలవపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఉలవపాడులోని గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 20వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులిస్తామని చెప్పారు.

విద్యారంగ అభివృద్ధికి యూటీఎఫ్ కృషి

● జిల్లా అధ్యక్షుడు వీవీ శేషు

లింగసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషు తెలిపారు. ఆదివారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ మండలశాఖ నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘం లక్ష్యాలను అర్థం చేసుకొని పనిచేయాలన్నారు. గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు పాఠశాలల పరిరక్షణకు, విద్యారంగం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కే రమేష్‌ను, ఇటీవల బదిలీపై మండలం నుంచి వెళ్లిన ఉపాధ్యాయులను అభినందించారు.



నూతనంగా ఎంపికైన మండల యూటీఎఫ్ శాఖ కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎంపిక

ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో యూటీ ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా ఎన్ ఇమాన్ హుసేన్, అధ్యక్షుడిగా కే వెంకట్రావు, సహ అధ్యక్షులుగా తిరుపతయ్య, శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా సుధాకరరావు, కోశాధికారిగా రవిబాబు, జిల్లా కౌన్సిలర్లుగా సుధాకరరావు, మాధవరావు, పద్మ, కిశోర్, సుబ్బారావు, మండల కార్యదర్శులుగా లక్ష్మమ్మ, కొండలరావు, ప్రభావతి, శ్రీనివాసులు, కొండయ్య తదితరులను ఎన్నుకున్నారు.

బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14, అండర్ 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక ఆదివారం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. వందమందికి పైగా క్రీడాకారులు హాజరుకాగా వారిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జట్లు ఎంపిక చేశారు. అండర్ 17 విభాగంలో ఎంపికైన బాల బాలికల జట్లు ఏలూరు జిల్లా నూజివీడులో ఈనెల 21 నుంచి 23 వరకు జరుగు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని, అండర్ 14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈనెల 23నుంచి 25 వరకు జరుగు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీలు డాక్టరు సీహెచ్ వెంకటేశ్వర్లు, శిరీష కుమారి తెలిపారు. ఈ ఎంపికల ప్రక్రియలో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ టీ.సుబ్బారావు, సయ్యద్‌జిలానీబాషా, పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, ఎం. నరసింహం, కోటేశ్వరరావు, కరుణ కుమార్, మాల్యాద్రి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాజట్టుకు ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

కాపుల కార్తీక వనభోజనాలు

● కాపు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 25 లక్షల విరాళం ప్రకటన

కావలి (టౌన్) నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ లోని వేటూరి రామిరెడ్డి తోటలో ఆదివారం కాపుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ లక్ష్యాన్ని అయినా సాధించాలన్న సంకల్పం కాపుల్లో మొండుగా ఉంటుందని, ఐక్యత వారిలో కనిపించే ప్రత్యేకత అన్నారు. కాపు భవన నిర్మాణానికి తనవంతుగా రూ. 25 లక్షల విరాళం అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎమ్మెల్యేని కాపులు ఘనంగా సత్కరించారు. అనంతరం జయం కూచిపూడి నాట్యాలయ గురువు జాహ్నవి పర్యవేక్షణలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి కాలువకు సాగునీరివ్వాలి

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కావలి కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని వైసీపీ మండల కన్వీనర్ ఎం వీరరఘు డిమాండ్ చేశారు. బోగోలు మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నార్లు పోసుకుని సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని, సోమశిలలో నీరు పుష్కలంగా ఉన్నా.. సాగునీరు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కే సురేంద్రరెడ్డి, మాచర్ల, ఎం శ్రీనివాసులు, పీ మల్లారెడ్డి, ఆర్ మోహన్‌రెడ్డి, ఏకే సుందర్‌రాజ్, కే శ్రీనివాసులు, జీ సుధాకర్, సాగర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలహరి పుట్టినరోజు వేడుకలు



బోగోలులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు అంబేద్కర్ విగ్రహ కూడలిలో జనసేన మండలాధ్యక్షుడు టీ వెంకటేష్ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ నాయకుడు అలహరి సుధాకర్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కూటమి నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్ కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ సుధీర్ బాబు, మైనార్టీనేత రఫీబాషా, జనసేన నాయకులు సురేష్, కార్తీక్, శ్రీనివాసులు, కాలేబు, రవి, నాగరాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ కారుమంచి కార్తీక శర్మ ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, జనసేన నాయకులు కత్తుల విజయకుమార్, కత్తి అనీల్, పేట రాఘవయ్య, చేవూరు సుబ్రహ్మణ్యం, బెజవాడ రవి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం



ఉలవపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కరేడు గ్రామంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో శివపార్వతులకు ప్రత్యేక ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు, ప్రత్యేక అలంకరణ చేసి అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నవితరణ నిర్వహించారు.

ఉత్సాహంగా ఆర్యవైశ్య వనభోజనాలు

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయరహదారి వద్ద నగరవనంలో కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెనుగొండ పీఠాధిపతి బాలస్వామీజీ చేతుల మీదుగా శివపార్వతులతో పాటు నాగేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక అలంకరణలో శివలింగం ఏర్పాటు చేయించి సంపూర్ణచంద్రాకారంలో దీపాలను వెలిగించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా నగరవన ప్రాంతంలో వేప, రాగి మొక్కలు నాటించారు. వనమిత్ర ప్రాంగణంలో కావలి డీఎస్పీ శ్రీధర్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కే రామిరెడ్డి మొక్కలు నాటారు. చిన్నారుల నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కావలి రూరల్ స్టేషన్ సీఐ రాజేశ్వరావు, ఎస్ఐ ఎన్ ప్రభాకర్, అటవీ శాఖాధికారులు సుమన్, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



శివపార్వతులకు పూజలు చేస్తున్న బాలస్వామీజీ, ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ఆర్యవైశ్య నాయకులు

పడమటిపాళెంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విజయగణపతి, నాగేంద్రస్వామి, మహాలక్ష్మమ్మ, చతుర్భుఖి దేవత విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం భక్తులకు టీడీపీ రాష్ట్ర క్యాదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సరిత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, స్వగ్రామంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గిరిధర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, పద్మావతమ్మ దంపతులు తదితరులు పాల్గొన్నారు.



విజయ గణపతిని దర్శించుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో కాశీవిశ్వేశ్వరుడికి అభిషేకాలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి సమక్షంలో కాశీవిశ్వేశ్వర స్వామికి క్షీర, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

నాగవర్పమ్మకు పూజలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరప్పమ్మ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నాగవరపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వేడుకగా కార్తీక వనభోజన మహోత్సవం



మర్రిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవులు

మర్రిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా యాదవ సంఘం భవన్ ట్రస్ట్ చైర్మన్ నాగకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మర్రిపాడు మండల కేంద్రంలో కార్తీక వనభోజన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి పిఎస్ఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ గోపూజ, ఉసిరిక చెట్టు పూజ, శివపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ చెంచులబాబు యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం వన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐఐసి డైరెక్టరు కటారి రమణయ్య యాదవ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, బీసీ నాయకులు గంగాధర్ యాదవ్, ఎలగాల వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ

తరుణవాయిలో పైలెట్ ప్రాజెక్టు

● విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అమలు : డీఆర్‌డీఏ పీడీ

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుర్రపు డెక్క ఆకుతో ఎరువు తయారీ కేంద్రాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా సంగం మండలంలోని తరుణవాయిలో ప్రారంభించినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. ఆదివారం ఆమె తరుణవాయిలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సందర్శించి తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 రోజులకు ఎరువు తయారవుతుందని, దానిని అగ్రికల్చర్ ల్యాబ్‌కు పంపి పరీక్షల అనంతరం బాగుందని తేలితే జిల్లావ్యాప్తంగా మరికొన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంగం మండలంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, రైతు రమణారెడ్డి తదితరుల ప్రోత్సాహంతో తరుణవాయిలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం మధుసూదన్, ఏపీఎం రవిశంకర్ రెడ్డి, సీసీలు, సంఘబంధం సభ్యులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు రూ. 1300 కోట్ల బ్యాంక్ రుణాలు

జిల్లాలోని 37వేల పొదుపు సంఘాలకు ఈ ఏడాది బ్యాంకుల ద్వారా రూ. 1300 కోట్లు రుణాలుగా అందించాలని లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ. 800 కోట్లు అందచేశామన్నారు. స్త్రీనిధి పథకంలో రూ. 298 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 160 కోట్ల రుణాలు అందచేశామన్నారు. ఉన్నతి పథకంలో ఎస్సీ, ఎస్టీలకు జీవనోపాధి పథకాలకు లక్ష రూపాయలు వడ్డీలేని రుణాలు అందచేస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యారుణాలతోపాటు కల్యాణ రుణాలు అందచేస్తున్నామన్నారు. పొదుపు సంఘాల లావాదేవీల్లో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం కొత్త యాప్ విడుదల చేసిందని, సభ్యులు నేరుగా వారి మొబైల్‌లో రుణాలు చెల్లించే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



గుర్రపు డెక్కాకుతో ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

టీడీపీ మండలాధ్యక్షుడు చింతలకు సన్మానం



టీడీపీ మండల అధ్యక్షుడు చింతలను సన్మానిస్తున్న జనసేన నేతలు

సీతారామపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల టీడీపీ మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన చింతల శ్రీనివాసులును ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ పిఓసి కొట్టే వేంకటేశ్వర్లు, సీతారామపురం మండల కన్వీనర్ పాలిశెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఆలూరి రవీంద్ర ఆదివారం ఆయన నివాసంలో కలిసారు. ఈసందర్భంగా చింతలను ఘనంగా సన్మానించారు.

మానసిక రోగిని బాధ్యులకు అప్పగించిన పోలీసులు

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై దుస్తులు లేకుండా తిరుగుతున్న ఓ మానసిక రోగిని ఆత్మకూరు సీఐ జి గంగాధర్ బాధ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున రోడ్డుపై వెళుతున్న సీఐ గంగాధర్, ఎస్ఐ అతనిని గమనించి విచారించగా కరీంనగర్‌కు చెందిన సుభానిగా తెలుసుకుని, దుస్తులు ఏర్పాటు చేయడంతో పాటు, అల్పాహారం పెట్టారు. అతను ఏఎస్‌పేట దర్గాకు వచ్చినట్లు తెలుసుకుని పోలీసు వాహనంలో ఎక్కించి అక్కడికి తరలించి బాధ్యులకు అప్పగించారు.

జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యుడు, ఉదయగిరి నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కొట్టె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని శకునాలపల్లి గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కల్లూరి సురేంద్రరెడ్డి సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో ఆయన ఇంటికెళ్లి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చూపాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేసి రాష్ట్రంలో ఉదయగిరి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అల్లూరి రవీంద్ర, పాలిశెట్టి శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, నవీన్, అంజి, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

బొబ్బిలి కోటను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల



బొబ్బిలి కోటలో ఆయుధాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల తదితరులు

ఉదయగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక నేపథ్యం కలిగిన బొబ్బిలి కోటను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా తన స్నేహితుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన ఆయనకు సాదరంగా స్వాగతం పలికి బొబ్బిలి వీణను బహుమతిగా అందజేశారు. అనంతరం కోటలోని అలనాటి బొబ్బిలి యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, రాజవంశానికి చెందిన కార్లు, రాజుల చిత్రపటాలు, కోటలోని ముఖ్య ప్రదేశాలను ప్రతినిధులతో కలిసి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత లైబ్రేరియన్ ఏ గోవిందరెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కే ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన వారోత్సవంలో ఆయన పాల్గొని గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. గ్రంథపాలకుడు నారాయణరావును అభినందించారు. కార్యక్రమంలో బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

వింజమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఖమ్మం సీనియర్ పిరమిడ్ మాస్టర్ చల్లా శ్రీనివాసరావు అన్నారు. పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యాన సాధన గురించి వివరించారు.



తూపిలిపాళెం తీరం వద్ద ఎగిసిపడుతున్న సముద్రపు కెరటాలు

ఎగిసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో ఆదివారం అలలు ఉధృతంగా నురగలతో కనిపించాయి. తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, వైట్ కుప్పం, నవాబుపేట తదితర గ్రామాల్లో చలిగాలులు వీచాయి. ఇప్పటికే మత్స్యకారులు పడవలు, వలలు తదితర సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

\- వాకాడు, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో జస్టిస్ సూర్యకాంత్




సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికైన జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం కుటుంబ సమేతంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు జస్టిస్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, ప్రొటోకాల్ జడ్జి గురునాథం, స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయర్, బేబీ రాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

చక్కని తల్లికి ఛాంగుభళా!

- పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



విష్వక్సేనుడి ఊరేగింపు



అంకురార్పణలో భాగంగా పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖమండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యుడు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. ఆ పుట్టమన్నును ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చి నవపాలికల్లో నింపారు. అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు.

ముత్యపు కవచంలో అమ్మవారు

పద్మావతి అమ్మవారు ఆదివారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

ఉదయం.. లక్ష కుంకుమార్చన

ఉదయం పూజల అనంతరం పద్మావతి అమ్మవారిని శ్రీకృష్ణస్వామి ముఖమండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు అమ్మవారి లక్ష్మీసహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు



- ఉదయం 9.10 నుంచి 9.30 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుంది. తొలుత అమ్మవారితో పాటు గజ చిత్రపటాన్ని తిరువీధుల ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. గజ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగుర వేయడంతో ధ్వజారోహణం ముగుస్తుంది.
- మొదటి ఏడు రోజులు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో, ఎనిమిదో రోజు రథమండపంలో మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. చివరి రోజైన తొమ్మిదో రోజు ఉదయం 10 గంటలకు అమ్మవారితో పాటు చక్రత్తాళ్వార్‌కు పంచమితీర్థం మండపంలో స్నపన తిరుమంజనం జరుగుతుంది.
- సోమవారం నుంచి రోజూ సాయంత్రం 5.30 నుంచి 6గంటల వరకు ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు.
- సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్నశేషవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు.

ఆరుగురిపై పీడీయాక్ట్

ఎస్పీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వివిధ నేరాల్లో పాల్గొన్న ఆరుగురిపై పీడీయాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ విక్రయాలు, భూకబ్జాలు చేసేవారిపైనా త్వరలో పీడీయాక్ట్ తీసుకొస్తామన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. పదేపదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని స్పష్టంచేశారు. జిల్లాలోని పోలీసులు తమ పరిధిలో నేరచరిత్ర, గూండా, డ్రగ్స్ మొదలగు చర్యలకు పాల్పడే వారిపై పర్యవేక్షణ కొనసాగించి ప్రత్యేక జాబితా తయారుచేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై సమీప పోలీస్‌స్టేషన్ లేదా జిల్లా పోలీస్‌కంట్రోల్ రూమ్.. 112కు ఫోనుచేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పీడీయాక్టు నమోదైన వారు

- షేక్ కాలేషా. గూడూరు మండలం చవటపాళెం. పది కేసుల్లో నిందితుడు.
- కనుపూరు శ్రీహరి అలియాస్ జెమిని(38). గూడూరు అరుంధతిపాళెం. ఆరు కేసులున్నాయి.
- సయ్యద్ అజీమ్(30). తిరుపతి నగరం కొర్లగుంట మారుతీనగర్. గంజాయి, హత్య, దొమ్మికేసులో నిందితుడు.
- వట్టికుంట అరుణకుమార్ అలియాస్ అరుణ్(32). చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మపల్లి. నాలుగు కేసుల్లో నిందితుడు.
- ఎం.సునీల్(29). నెల్లూరు నగరం పెన్నానది ఒడ్డున కలవకట్ట వద్ద నివాసం. ఇతడిపై 34 కేసులున్నాయి.
- ప్రసన్నకుమార్(32), సూళ్లూరుపేటకు చెందిన ఇతడు దొంగతనాలు, హత్యాయత్నం, గంజాయి కేసుల్లో నిందితుడు.

సరదాగా ఈతకు వెళ్లి ...

బావ, బామ్మర్ది మృతి

రేణిగుంట నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొట్టేందుకు ఆదివారం మల్లిమడుగు డ్యామ్ వద్దకెళ్లారు. అక్కడి గుంతలోకి దిగి బావ, బావమరిది మృతి చెందారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. తిరుపతి మల్లగుంటకు చెందిన నర్సింగ్ శివ (32), దర్శి నరేష్(36) బావ, బావమరుదులు. స్థానికంగా జీపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఇద్దరు తమ స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం సరదాగా గడిపేందుకు రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంకు వచ్చారు. గేట్లకు సమీపంలోని గుంతలో ఈత కొట్టేందుకు శివ వెళ్లారు. ఈత కొడుతూ లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో కేకలు వేస్తూ మునిగిపోతుండగా.. ఒడ్డుపై ఉన్న నరేష్ అతడిని రక్షించేందుకు నీటిలో దూకాడు. వీళ్లిద్దరూ మునిగిపోతుండగా చంద్రశేఖర్ పెద్దగా కేకలు వేస్తూ సమీపంలోని గ్రామంలోకి పరుగులు తీశారు. స్థానికులు డ్యాం వద్దకు చేరుకుని నీటిలో మునిగిపోయిన శివ, నరేష్ కోసం గాలించారు. ఇంతలో రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మునిగిపోయిన వ్యక్తులను స్థానికులు వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శివ, నరేష్ మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

హెచ్చరిక బోర్డు పెట్టినా..

మల్లిమడుగు డ్యాం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో సందర్శకులను నిషేధిస్తారు. డ్యాం అధికారులు ప్రధాన గేటు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా సందర్శకులు లెక్క చేయడం లేదు. డ్యాం దిగువ ప్రాంతాల్లోకి వెళ్లి మద్యం తాగుతుంటారు. మద్యం మత్తులో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

అందరం కలిసి బాలాజీ రైల్వే డివిజన్ సాధిద్దాం

- కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, భూమన్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న భూమన్

తిరుపతి(జీవకోన), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతపై గత నెలలో పార్టీలు, విద్యార్థి.. వ్యాపార సంఘాలకు అవగాహన కల్పించాం. ఇక అందరం కలిసి డివిజన్ సాధన కోసం కృషి చేద్దాం' అని బాలాజీ రైల్వేడివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ పిలుపునిచ్చారు. తిరుపతిలో ఆదివారం డివిజన్ సాధనకు సంబంధించి 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సమావేశాన్ని నిర్వహించారు. 'బాలాజీ రైల్వేడివిజన్ ఏర్పాటైతే 10 వేల నుంచి 15వేలకుపైగా ఉద్యోగావకాశాలు వస్తాయి. పరిపాలన ప్రయోజనాలు, ఆయా పనులకు వేగవంతంగా ఆమోదాలు లభిస్తాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్దాం' అని కుప్పాల గిరిధర్ అన్నారు. 'డివిజన్ సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలి. రేణిగుంట నుంచి చంద్రగిరి వరకు పాదయాత్ర చేద్దాం' అని భూమన్ సూచించారు. 'ఇది ఉద్యమం వంటిది. అందరూ కలిసి రావాలి' అంటూ బాలాజీ డివిజన్ ఆవశ్యకతను విశ్రాంత ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి వివరించారు. ఈ సమావేశంలో భూపాల్‌నాయుడు, ఆర్ఎస్‌రామిరెడ్డి, విశ్రాంత పోలీసు అధికారి కృష్ణయ్య, విశ్రాంత రైల్వే అధికారి పుష్పరాజ్, శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి, ఫిలిం సొసైటీ సభ్యులు బుచ్చిబాబునాయుడు, శేషగిరిరావు, హ్యూమన్ రిసోర్సెస్ ప్రభాకర్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ దామోదరరెడ్డి, అజయ్, ప్రసన్నకుమార్, వైఎస్ బాబు, మాధవీలత, చరణ్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19నుంచి పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలు 24 వరకు ఆరు రోజుల పాటు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా రవాణాధికారి జగదీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. '30మంది బృందం ముందుకొస్తే ఒక బస్సు కేటాయిస్తాం. వ్యక్తిగతంగా వెళ్లేవారికి అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాం' అని తెలిపారు.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ ఏపీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వ్యాపార రంగాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫోను చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. 89777 16661 నెంబరుకు ఫోనుచేసి.. 91333 31912 నెంబరుకు చాట్ చేసి సమస్యలను ప్రస్తావిస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లిక్విడ్ గంజాయి కలకలం



లిక్విడ్ గంజాయి బాటిల్

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లె సమపంలోని స్వర్ణముఖినది పరిసరాల్లో లిక్విడ్ గంజాయి బాటిల్ దొరికింది. దీంతో ఆదివారం స్థానికంగా కలకలంరేగింది. కర్మక్రియల మండపం (షెడ్డు) వద్ద కొంత మంది యువకులు రోజూ మద్యం తాగడం, బాటిల్లో నింపిన గంజాయిని పొగబెట్టి పీల్చుతూ మత్తులో జోగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పదేపదే పొలాల వద్దకు రావద్దని వారికి చెప్పినా వినడం లేదన్నారు. దీంతో మహిళలు ఒంటరిగా తమ పొలాలకు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ కమిటీ ఎదుటకు డీసీసీబీ అక్రమాలు

- వైసీపీ పాలనా కాలంలో నిధుల దుర్వినియోగంపై నేడు విచారణ
- కమిటీ కోరిన వివరాలతో హాజరు కానున్న డీసీసీబీ సీఈవో

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అక్రమార్కులపై చర్యలకు అడుగు ముందుకు పడింది. అయిదేళ్ల వైసీపీ పాలనలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై శాసనసభా సంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. ఈ కమిటీలో చిత్తూరు జిల్లా నుంచి ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో పాటు ఏడుగురు సభ్యులున్నారు. గత ఐదేళ్లలో ఇచ్చిన రుణాల వివరాలు, గోదాముల స్థితిగతుల గురించి శాసనసభా కమిటీ సమాచారం కోరిందని డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు తెలిపారు. సోమవారం జరిగే విచారణకు పూర్తి వివరాలతో హాజరవుతున్నామన్నారు.

పేరుకుపోయిన మొండిబకాయిలు: వైసీపీ హయాంలో డీసీసీబీకి సెవెన్‌మెన్ కమిటీని, 75 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను నియమించి బినామీల పేరుతో రుణాలను బొక్కేశారు. భూమి లేకున్నా వైసీపీ కార్యకర్తలకు పంట రుణాలివ్వడంతో డీసీసీబీలో రూ.105 కోట్ల మేరకు మొండి బకాయిలున్నాయి. ఇందులో అక్రమ రుణాలను అధికారులు గుర్తిస్తున్నారు. ఆయా వివరాలన్నీ సభాసంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇక, అవసరమున్నా.. లేకున్నా గత ప్రభుత్వంలో గోదాములను నిర్మించారు. ఒక్కో గోదాము కోసం సింగిల్‌విండోలు తీసుకున్న రూ.40 లక్షలను నాలుగుశాతం వడ్డీతో ఏడేళ్లలో డీసీసీబీకి చెల్లించాలి. ఇప్పటికీ గోదాములు నిరుపయోగంగా ఉండటంతో వాటిపై రాబడిలేకుండా పోయింది.



నిరుపయోగంగా వున్న కుప్పంలో నిర్మించిన గోదాము

బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి: జగనన్న తోడు పథకం ద్వారా రూ. 22 లక్షలు, జగనన్న పాల వెల్లువ ద్వారా రూ. 8 కోట్లు, కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రూ. 4కోట్లు , ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 32 లక్షలు తీసుకున్నా.. పైసా కూడా డీసీసీబీకి తిరిగి అందలేదు. ఇలా ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారించారు. డీఆర్వో మోహన్ కుమార్‌తో విచారణ చేయించారు. 48 మంది బ్యాంకు ఉద్యోగులపై చర్యలు చేపట్టారు. డీఆర్వో ఇచ్చిన నివేదికలో రూ.23కోట్ల మేర అవినీతి జరిగినట్లు తేల్చారు.

ఘనంగా అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం



అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తబృందం

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్ప స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. జీఎన్‌టీ రోడ్డు చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న అయ్యప్ప ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప స్వామి జ్యోతుల గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. బాణసంచా పేలుళ్లు, కేరళ బ్యాండ్ మేళాలు, అయ్యప్ప భక్తబృందం భజనల నడుమ అయ్యప్పస్వామిని ఆలయం వద్ద నుంచి జీఎన్‌టీ రోడ్డు, బాపూజీ వీధి, కచ్చేరివీధి, పాండురంగ, పార్కు వీధుల్లో ఊరేగించారు. మహిళలు దీపాలు చేతపట్టుకుని దీపపూజలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక



జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్లతో ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జట్లను ఎంపిక చేశారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి 50 మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. వీరికి పోటీలను నిర్వహించి జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సొండిపూడిలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, చెంచయ్య, మహేష్, కోటేశ్వర రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైనా ధృవీకరణ పత్రాలులేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడుతామన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కొండవల్లిపాడులో పురాతన విగ్రహాలు



అమ్మవార్ల సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహాలు

ఓజిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కొండవల్లిపాడులో పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో తవ్వవాలు జరుపుతుండగా విగ్రహాలు బయటపడ్డాయి. ఇవి వందల ఏళ్ల కిందటి విగ్రహాలుగా స్థానికులు చర్చించుకోవడంతో ఈ విషయం ఆదివారం వెలుగు చూసింది. ఇవి అమ్మవార్ల సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహాలని కొందరు చెబుతుండగా, విష్ణుమూర్తి అవతారంగా కొందరు భావిస్తున్నారు.

చెందోడులో రక్తదాన శిబిరం

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో ఆదివారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఆ సంస్థ చైర్మన్ లీలామోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో యువతి, యువకులు రక్తదానం చేశారు. గూడూరుకు చెందిన మేడీవల్స్ బ్లడ్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సురేష్, విశ్రాంత హెచ్‌ఎం రామశెట్టి ఆధ్వర్యంలో రక్తదాతలను షీల్డ్‌లు, మెమోంటోలు, ప్రసంశాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో వంశీధర్‌రెడ్డి, చంద్రమౌళి, అనిల్‌అశోక్, బాలు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్, బస్టాండ్, ఆలయాలు, కూడలి ప్రాంతాల్లో నిరుపేదలకు తడకండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ చైర్మన్ నెల్లూరు నాగరాజు హార పొట్లాలు, వాటర్ బాటిళ్లను ఆదివారం అందజేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

నాయుడుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంటలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. బాధితురాలి కథనం మేరకు... లోతువానిగుంటలో నివాసం ఉంటున్న సుబ్బమ్మ ఆదివారం తమ కుమార్తెలతో కలిసి కూలి పనులకు వెళ్లింది. ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో మంటలు అంటుకున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచిన రూ.2 లక్షల నగదు, బంగారు ఆభరణాలు కాలిపోయినట్లు బాధితురాలు సుబ్బమ్మ ఫిర్యాదులో పేర్కొంది.

పేకాట స్థావరంపై దాడి

9 మంది అరెస్టు

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట మండలం ఊనుగుంటపాళెం సమీపంలోని జామాయిల్ తోటల్లో పేకాట స్థావరంపై ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.





ఆగిపోయిన నగర వనం ముఖద్వార పనులు - అసంపూర్తిగా ఉన్న స్టేడియం - నిరుపయోగంగా మారిన చిన్నారుల ఆట వస్తువులు

ఆహ్లాదం.. ఆమడ దూరం

అటకెక్కిన నగర వనం పనులు

వెంకటగిరి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలన్న ధ్యేయంతో తలపెట్టిన నగర వనం పనులు అటకెక్కాయి. వెంకటగిరి - తిరుపతి జాతీయ రహదారిలో వెంకయ్యస్వామి ఆలయ సమీపంలో 45ఎకరాల విస్తీరణంలో రూ.1.60కోట్లతో ఈ ఏడాది ఫిబ్రవరిలో నగర వనం ఏర్పాటు పనులు ప్రారంభించారు. నగర వనంలో ఆర్చి టవర్, యోగా కేంద్రం, వాకింగ్ ట్రాక్, స్టేడియం, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటుతో పాటు పచ్చదనం కోసం పలు రకాల మొక్కలు నాటారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.1.20కోట్లు ఖర్చు చేశారు. అయితే ఈ పనులేవీ పూర్తి కాలేదు. అన్నీ అరకొరగానే చేసి అసంపూర్తిగా వదిలేశారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో నగర వనంలో వడంతో విలువైన పరికరాలు తుప్పుపడుతున్నాయి. చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు దృష్టి సారించి నగరవనం పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసురావాల్సిన అవసరం ఉంది.



మూత పడిన నగర వనం

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం: పాశిం



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సంగం థియేటర్ సెంటర్‌లో రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోపే మున్సిపాలిటీ పరిధిలో రూ.9 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంగం థియేటర్ సెంటర్ నుంచి పోటుపాళెం జాతీయ రహదారి వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. త్వరలోనే అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అనంతరం చెరువు కట్టను పరిశీలించి మొక్కలు నాటారు. గూడూరు చెరువు కట్టను ఆధునీకరించి చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్, పార్కును ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తుడా పరిధిలోని మున్సిపాలిటీల్లో వసతుల మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారు మండలంలోని నెల్లటూరు గ్రామంలో పర్యటించారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పేట క్రీడాకారులు

నాయుడుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మనీషా, ప్రధాన కార్యదర్శి పి.అఖిల్, కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కాకినాడలోని సూర్యా కళామందిర్‌లో ఈనెల 15,16 తేదీల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. ఇందులో సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.పూజిత, ఎ.మహిత బంగారు పతకాలు, బి.భవానీ క్యాంస పతకం, సబ్ జూనియర్ బాలుర విభాగంలో సీహెచ్ రుషికేష్ వెండి పతకం, మోహిత్‌సాయి, ఎం.నిరీక్షణ్ క్యాంస పతకాలు కైవశం చేసుకున్నారు. వీరు వచ్చే నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్‌కుమార్ తెలిపారు.



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులు కోచ్ పవన్‌కుమార్




సరస్సులో జాలర్ల చేపలవేటను శ్రీహరికోట రోడ్డులో వంతెనపై నుంచి పరిశీలిస్తున్న సందర్శకులు - సరస్సులో పక్షుల కిలకిలరావాలు

పులికాట్‌లో సందర్శకుల సందడి

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులికాట్ తీరం సందర్శకులతో సందడిగా మారింది. తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు సరస్సుకు భారీగా వరదనీరు చేరి నిండుకుండను తలపిస్తోంది. విదేశీ వలస పక్షులు కిలకిలరావాలతో కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు కావడంతో సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో పులికాట్ తీరం వెంబడి సందర్శకుల తాకిడి అధికంగా కనిపించింది. కుదిరి నుంచి అట్టకానితిప్ప మధ్య సరస్సులో పక్షులు ఎగురుతూ చక్కెర్లు కొడుతూ కనిపంచాయి. సందర్శకులు సరస్సు అంచున తిరుగుతూ సెల్‌ఫోన్‌లో పక్షులను బందిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు.

కాలేషా మృతి తీరని లోటు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు కాలేషా మృతి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కాలేషాకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లపాటు సీపీఐలో పనిచేస్తూ ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కాలేషా అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. పార్టీ పటిష్టతకు ఆయన ఎంతో కృషిచేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, గోపాల్, గోను శివకుమార్, విజయ్‌కుమార్, ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, జమాలుల్లా, శ్రీనివాసమూర్తి, వేగూరు రాజేంద్రప్రసాద్, అరవ పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువతి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. మండల పరిధిలోని కాదలూరు గ్రామానికి చెందిన బిందుప్రియ భర్తతో గొడవపడి కొద్ది రోజులుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. శనివారం నుంచి కనిపించకపోవడంతో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూళ్లూరుపేటలో అకస్మాతుగా ఆగిన జైపూర్ ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటు వద్ద శనివారం చెన్నై నుంచి జైపూర్ వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఐదు నిమిషాల పాటు ఆగిపోయింది. ఎం1 బోగిలో ఓ ప్రయాణికుడికి చైన్ తగులుకోవడంతో రైలు ఆకస్మాతుగా ఆగిపోయింది. వెంటనే టెక్నికల్ టీమ్ అక్కడకు చేరుకుని బోగీని పరిశీలించారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని గుర్తించిన అనంతరం రైలు బయలుదేరి వెళ్లింది.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

చిట్టమూరు, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): చిట్టమూరులో అయ్యప్పస్వామి పడి పూజ, జ్యోతి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజను ప్రారంభించారు. 108 కలశాలలోని ద్రవ్యాలతో స్వామి పంచలోక విగ్రహానికి, మొదటిసారి అయ్యప్పమాల ధరించిన భక్తులు అభిషేకాలు చేసి మహానైవేద్యం సమర్పించారు. పడిపూజ జరిగే ప్రాంగణమంతా శబరిమల పుణ్యక్షేత్రంగా సెట్టింగ్ వేసి అయ్యప్ప స్వామి ప్రతిమతో తీర్చిదిద్దారు. కేరళకు చెందిన గురుస్వాములు, కత్తి మోహన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాత్రి అఖండ జ్యోతిని వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు.

కార్తీక మాస వనభోజనాలు

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో వెలసిన భవానీశంకరుడి ఆలయంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాలు జరిగాయి. గోపూజతో పాటు భవానీశంకరుడికి రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం భవానీశంకరుడి విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అన్నాభిషేకం జరిగింది. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతులతో పాటు షిరిడీసాయి అక్షయసేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య ఆధ్వర్యంలో భవానీశంకరుడికి పలు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య భవానీశంకరునికి పల్లకీసేవలు నిర్వహించారు. కోటకు చెందిన షిరిడీసాయి అక్షయసేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వనభోజనాలు నిర్వహించారు. రాజమండ్రిలోని మండపేట వారిచే జడ కోలాటం ఆడారు.



భవానీశంకరుడి విగ్రహానికి అన్నాభిషేకం చేస్తున్న వేదపండితులు

టీడీపీ నేతకు పరామర్శ

దొరవారిసత్రం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పొదిలి భాస్కర నాయుడిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మమణ్యం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేసుకొన్న భాస్కర నాయుడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం ఆయన ఇంటికి వెళ్లిన నెలవల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొన్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, సొసైటీ అధ్య క్షుడు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, డైరెక్టర్ సంచి విజయ్‌కుమార్, స్థానిక నాయకులు ప్రసాద్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, బాబు నాయుడు తదితరులు ఉన్నారు.



భాస్కర నాయుడిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పుస్తక లక్షాధికారి

● లంకా సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చూడ్డానికి సాదాసీదాగా కన్పించే లంకా సూర్యనారాయణ లక్షకు పైగా పుస్తకాలు సేకరించి, సంరక్షిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. గుంటూరులో పుస్తకాభిమానులు ముద్దుగా గ్రంథాళ్వార్‌గా పిలుచుకునే ఆయన గ్రంథాలయంలో చదువుకున్న అనేక మందికి ప్రపంచ విజ్ఞానం ఒంటబట్టింది. కుమారుడు కూడా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎస్వీ యూనివర్శిటీలోని శ్రీనివాసా ఆడిటోరియంలో సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ.

నేపథ్యం

మాది గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం. వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న పెదలక్ష్మీనారాయణ, రంగనాయకమ్మ. పత్తిపాడు హైస్కూల్లో పదవ తరగతి వరకూ, గుంటూరులో బీఎస్సీ దాకా చదివా. కస్టమ్స్ శాఖలో సూపరిండెంట్‌గా పనిచేసి రిటైరయ్యా. శ్రీ వేంకటేశ్వర ధార్మిక సేవా సమితి, అన్నమయ్య సేవా సమితి, స్వధర్మ సేవా సమితి అధ్యక్షులుగా పని చేశా.

పుస్తకాలపై ఆసక్తి

గాలీ నీరూ వెలుగూ అందరికీ ఎలా లభిస్తున్నాయో, పుస్తకాలు కూడా అంతగా అందుబాటులో ఉండాలనే చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యాఖ్య నాకు నిత్యస్ఫూర్తిని కలిగిస్తుంటుంది. దీంతో పాటు మా బాబాయి ఉప్పలపాటి ఆనందరావు కమ్యూనిస్టు కార్యకర్త. ఆయనకు విపరీతమైన పుస్తకాల పిచ్చి. ఆయన ద్వారా పుస్తకాలకు చేరువై లెక్కకుమించి చదివా.

గ్రంథాలయ ఏర్పాటుకు బీజం

గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తి కలిగింది.పుస్తకాలను సేకరించి, గ్రంథాలయంలో కొలువుదీర్చా. అనేకమంది సాహితీప్రముఖులు, పుస్తకాభిమానులు సందర్శిస్తుండడం చూసి నేను కూడా పుస్తక విజ్ఞాన వ్యాప్తికి కృషి చేస్తున్నాననే అనుభూతి కలుగుతుంది.ఈ గ్రంథాలయాన్ని భవిష్యత్తు తరానికి కూడా అందించాలనుకుంటున్నా.

పుస్తకాల సేకరణ

మా కుటుంబ వ్యక్తిగత గ్రంథాలయంలోనే 80 వేల పుస్తకాలుండేవి. అనేక మంది ప్రముఖులు మా ఇంటి లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదువుకునే వారు. ఇప్పుడు ఈ సంఖ్య లక్షా 30 వేలకు చేరింది. 100 మహాభాగవతాలు, 300 భాగవతాలు, 500 భగవద్గీతలు, 550 రామాయణాలు, 5 వేల ఆత్మకథలు, 51మంది అనువాదకులు చేసిన అనువాద గ్రంథాలు, 1600 శతకాలు, 700 నిఘంటువులు సేకరించా. వీటిలో ఏ పుస్తకమైనా కేటలాగ్ అవసరం లేకుండా క్షణాల్లో చేతికి అందించగలను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి భాషలకు సంబంధించిన పుస్తకాలు కూడా అనేకం ఉన్నాయి. వివిధ భాషా, సాహిత్య రంగాల్లో పరిశోధన చేసే వారికి ఈ గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది.

పుస్తకాభిమానులకు సలహా

పుస్తకాలను కొని చదవడమే కాదు, నలుగురికి అందించడం గొప్ప విషయం. మనం తెలుసుకున్న మంచి విషయాలను నలుగురికి తెలియజేయడం అవసరం. ఇది మనకు సంతృప్తిని కలిగించడమే కాక సమాజానికి కూడా మంచి చేస్తుంది.పుస్తకాన్ని మనం చదవడంతో పాటు అందరికీ చేరువ చేయడం పుస్తకాభిమానుల బాధ్యత.

లభించిన గుర్తింపు

నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ఉగాది కళారత్న పురస్కారం పొందా.శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. 2018లో అజోవిభో కందాళం పురస్కారాన్ని స్వీకరించా. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారం, పాతూరి నాగభూషణం పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సేవారత్న పురస్కార, సత్కారాలతో గుర్తింపు పొందా.



లక్ష్యం

ప్రస్తుతం తొంభై ఏళ్ల వయసులో ఒకే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. సేకరించిన పుస్తకాలను శాశ్వతంగా పరిరక్షించడానికి డిజిటలైజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నా.ఇందుకు పుస్తకాభిమానుల సహకారాన్ని కోరుతున్నా.